క్లుప్తంగా

ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలు

కలకడ : కలకడ ఆదర్శ పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ మల్లంగ్‌షావలి పేర్కొన్నారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపులకు ఆన్‌లైన్‌లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ఈ నెల 17వ తేదీ నుంచి దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. పదిలో సాధించే మార్కుల ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుందని తగెలిపారు. ఓసీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ కేటగిరీ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ కేటగిరీ విద్యార్థులు రూ.150 ప్రవేశ రుసుము చెల్లించి దరఖాస్తు చేయాలన్నారు.

జగనన్న ఇళ్లకు నిధులు పెంపు

కలకడ : 2019-24 వరకూ పీఎంఈవై, జగనన్న ఇళ్లకు ప్రభుత్వం అదనంగా నిధులు మంజూరు చేసింది. ఎస్సీ, బీసీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు అదనంగా ఇవ్వనున్నట్లు ఎంపీడీఓ అబ్దుల్‌రహీం, ఏఈ నాగమల్లయ్య తెలిపారు. బేస్‌మెంట్ లెవల్, రూఫ్‌లెవల్, మోల్డింగ్ లెవల్ దశలో ఉన్న వారికి అదనపు మొత్తం సద్వినియోగం చేసుకునేలా పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు.

భూ కబ్జాలను అరికట్టండి

మదనపల్లె సిటీ : మదనపల్లె నియోజకవర్గ పరిధిలోని దేవాలయ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్ గురువారం జిల్లా దేవాదాయశాఖ అధికారి విశ్వనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. పునీత్ మాట్లాడుతూ మదనపల్లె నియోజకవర్గ పరిధిలోని మాన్యం భూములను ప్రైవేటు వ్యక్తులు కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. వ్యాపార సముదాయాలు, బంకులు ఏర్పాటుచేసుకుని ప్రభుత్వ ఆదాయానికి గండిగొడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో శ్రీనాథ్, జగదీష్, వెంకటేష్, జశ్వంత్, ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.

23న మాలల సింహగర్జన

రామసముద్రం : ఈ నెల 23వతేదీన తిరుపతిలో జరిగే హలో మాల.. చలో తిరుపతి రాయలసీమ మాలల సింహగర్జనను విజయవంతం చేయాలని మాల మహానాడు మండల అధ్యక్షుడు కిష్టప్ప పిలుపునిచ్చారు. రామసముద్రంలో సంబంధిత కార్యక్రమ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఆయనమాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ, కమీషన్లు రద్దు చేయాలని, పెరిగిన జనాభా మేరకు రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేశారు. కృష్ణప్ప, బాలాజీ, శివశంకర, జయరాజ్, శివ, రామాంజులు, వెంకటేష్, నారాయణస్వామి, శ్రీనివాసులు, నరసింహులు, శేషు పాల్గొన్నారు.

నూనె గింజలతో ఆదాయం


మాట్లాడుతున్న వైవీ.రమణారావు

పీలేరు : రైతులు నూనె గింజలు సాగు చేసి అధిక ఆదాయం పొందవచ్చునని పీలేరు డివిజన వ్యవసాయ సహాయ సంచాలకులు వైవీ.రమణారావు అన్నారు. డివిజన్ స్థాయి రైతు శిక్షణ కార్యక్రమంలో భాగంగా గురువారం జాతీయ మిషన్.. వంటనూనెలు..నూనె గింజలు అంశంపై రైతులకు శిక్షణ ఇచ్చారు. కలుపు మందులలో పిండి మెలాతి వినియోగం తెలియజేశారు. రమాదేవి, శ్రావణి, కరుణాకర్‌రెడ్డి, జమీర్, ప్రవీణ్ పాల్గొన్నారు.


నీటి సమస్యపై దృష్టి పెట్టండి

పీలేరు రూరల్ : పీలేరు పట్టణంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా పంచాయతీ సిబ్బందికి సూచించారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో అధికారులు, పంచాయతీ కార్మికులు, సిబ్బందితో గురువారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. సమస్య పరిష్కరించడానికి సిద్ధంగా ఉండాలన్నారు.

డీఎస్పీలను నియమించాలి

మదనపల్లె : రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ కేసుల్లో అలసత్వం ప్రదర్శించడంతో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ ఉద్దేశం నీరుగారిపోతుందని బహుజన సేన రాష్ట్ర అధ్యక్షులు చందు అన్నారు. న్యూఢిల్లీలోని ఎస్సీ, ఎస్టీ జాతీయ కమిషన్ జాతీయ సభ్యులు వడ్డేపల్లి రామచంద్రను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ కేసులను సత్వరమే పరిష్కరించేందుకు డీఎస్పీలను నియమించాలన్నారు. కార్యక్రమంలో బహుజన సేన ఎస్టీ జిల్లా అధ్యక్షుడు మూడే రూపక్ నాయక్ పాల్గొన్నారు.

బాలికలకు స్వీయ రక్షణ అవసరం


బాలికలతో మాట్లాడుతున్న సీఐ ఎరిషావలి

మదనపల్లె : బాలికలకు స్వీయ రక్షణ అవసరమని వన్‌టౌన్ సీఐ ఎరిషావలి అన్నారు. పట్టణంలోని సొసైటీ కాలనీలోని విజయ భారతి హైస్కూల్‌లో గురువారం గర్ల్స్ సెల్ఫ్ డిఫెన్స్ క్యాప్సూల్ కోర్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేధింపులు ఎదుర్కొనేందుకు బాలికలకు స్వీయ రక్షణే మార్గమన్నారు. కరాటే బ్లాక్ బెల్టిస్ట్ మిస్ మిష్ఫా కోర్సు ప్రారంభించడం ఎంతో ఉపయోగమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చారిత్రక కట్టడం.. శిథిలం

- కూలిపోతున్న రంగినీ మహల్
- భవనం పెకప్పు దెబ్బతిని ఓవైపు కూలిందిలా..

చారిత్రాత్మక గుర్రంకొండ కోటలోని ప్రఖ్యాత రంగినీ మహల్ శిథిలమవుతోంది. గతంలో కురిసిన వర్షాలకు భవనం పైకప్పు దెబ్బతిని ముందు భాగం కూలిపోయింది. అధికారులు దృష్టి పెట్టకపోవడంతో మిగిలి భవనం కూలిపోయే దశలో ఉంది.


ముందు వైపున కూలిన పైకప్పు


రంగినీ మహల్ ముఖచిత్రం

గుర్రంకొండ : పట్టణంలో ముఖ్యమైన పర్యాటక ప్రదేశం రంగినీ మహల్. కోట ముఖద్వారం దాటగానే తొలుత కనిపించేదే ఈ మహల్. పూర్వ నవాబులు తమ ఆస్థానంలోని నాట్యగత్తె రంగమ్మ పేరుతో ఈ మహల్ నిర్మించారని చరిత్ర చెబుతోంది. మహల్ ముందు వైపు రెండు అంతస్తులు, వెనుకవైపు మూడు అంతస్తులుగా కనిపిస్తుంది. ఇంతటి ప్రాశ్యస్త్యమున్న ఈ భవనం వెనుక వైపు రెండో అంతస్తు పూర్తిగా దెబ్బతిని ఓ వైపు కుంగిపోయింది. గతంలో కురిసిన వర్షాలకు ఉన్నట్టుండి ధ్వజ స్తంభం రెండుగా చీలి పైకప్పు దెబ్బతిని ఒరిగిపోయింది. మిగిలింది ఎప్పుడు కూలిపోతోందో తెలియని పరిస్థితి.

పర్యాటకుల ఆందోళన

మహల్‌ను దర్శించుకునేందుకు వచ్చే పర్యాటకలు భవనం ఎక్కడ కూలుతుందోనని భయాందోళన చెందుతున్నారు. నిత్యం ఈ మహల్‌ను సందర్శించడానికి పెద్ద ఎత్తున పర్యాటకులు వస్తున్నారు. కోటలోని ఎంతో ప్రఖ్యాతి చెందిన ఈ భవనం దెబ్బతింటున్నా పురావస్తు అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. రెండేళ్ల కిందట మరమ్మతులకు నిధులు మంజూరయాయ్యని హడావిడి చేసి అనంతరం వదిలేశారు. ప్రస్తుతం భవనానికి మరో వైపున పైకప్పు దెబ్బతింటోంది. పురాతన కాలపు తీర్లు(కొయ్యలు) చెదలుపట్టి నేడు రేపో కూలిపోయే దశకు చేరుకున్నాయి. అటువైపు పర్యాటకులు వెళ్లాలంటే హడలెత్తిపోతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

సూర్యప్రభ వాహనంపై నారసింహుడు


ఊరేగుతున్న శ్రీలక్ష్మీనరసింహుడు


స్వామివారికి శుద్ధి తోమాలసేవ

గుర్రంకొండ : మండలంలోని తరిగొండలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి గురువారం సూర్యప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజున వేకువ జామునే మూలవర్లకు శుద్ధితోమాల సేవ, తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. వాహనమండపంలో రంగు రంగుల పుష్పాలతో అలంకరించి సూర్యప్రభ వాహనంపై స్వామిని కొలువుదీర్చారు. మేళ తాళాల మధ్య గ్రామ వీధులగుండా ఊరేగించారు. మధ్యాహ్నం స్వామి వారి మండపంలో మూలవరులకు ఊంజల్‌సేవ నిర్వహించారు. సాయంత్రం అలంకరించిన చంద్రప్రభ వాహనంపై స్వామిని గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. అనంతరం స్వామికి పార్వేట ఉత్సవం, దోపు తిరుణాల వైభవంగా నిర్వహించారు. అనంతరం అశ్వ వాహనంపై టీటీడీ కళాకారుల కోలాటం, చెక్క భజనల నడుమ రంగరంగ వైభవంగా ఊరేగింపు సాగింది. భక్తులు పెద్ద ఎత్తున ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

ఆలయంలో నేడు:

స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజున శుక్రవారం వసంతోత్సవం, స్నపన తిరుమంజనం, చక్రస్నానం, ఊంజల్‌సేవ, తిరుచ్చి ఉత్సవం, ధ్వజావరోహణం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు గోపాలబట్టార్ తెలిపారు.

యోగాతో ఆరోగ్యం మెరుగు


యోగా చేస్తున్న విద్యార్థులు

మదనపల్లె సిటీ : యోగాసనాలతో ఆరోగ్యం మెరుగుపడుతుందని దత్త క్రియా యోగ కేంద్రం శిక్షకులు వెంకట కామేశ్వరరావు, మైసూర్ దత్తక్రియ యోగా కేంద్రం ప్రిన్సిపల్ డాక్టర్ శివప్రసాద్ అన్నారు. పుంగనూరు రోడ్డులోని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీలో గురువారం దత్తక్రియ యోగా ఇంటర్నేషనల్ సెంటర్, ఎన్ఎస్ఎస్ విభాగం సంయుక్తంగా యోగాపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు యోగా చేస్తే జ్ఞాపకశక్తి మెరుగుపడి పరీక్షల్లో మంచి మార్కులు సాధించవచ్చునని తెలిపారు. అనంతరం యోగాపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ సతీష్‌బాబు, అధ్యాపకులు అమరనాథ్‌రెడ్డి, అరుణ్ కుమార్‌రెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి


కొవ్వొత్తులు వెలిగిస్తున్న విద్యార్థులు

కలకడ: పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించి గురువులు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని ప్రధానోపాధ్యాయురాలు లత సూచించారు. కలకడ ప్రభుత్వ పాఠశాలలో పది విద్యార్థులకు గురువారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. లత మాట్లాడుతూ ఉత్తమ విద్యతోనే ఉన్నత శిఖరాలు సాధ్యమని పేర్కొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు వారి తల్లిదండ్రులను ఎంతో ఆకట్టుకున్నాయి. అనంతరం సరస్వతీపూజ, ఓంకారం ఎదుట దీపారాధన చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీ ప్రసన్న, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల సమ్మె


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మదనపల్లె సిటీ : మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించక పోవడంతో ఈ నెల 17వ తేదీ నుంచి విధులు బహిష్కరించి సమ్మె చేపడతామని ఏఐటీయూసీ నాయకులు నాగరాజ అన్నారు. గురువారం మున్సిపల్ కమిషనర్ ప్రమీలను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ 2022 నుంచి పారిశుద్ధ్య కార్మికులకు సామగ్రి ఇవ్వలేదని, విజయవాడ వరదప్రాంతాల్లో పని చేసిన కార్మికులకు రూ.6 వేలు, రెండు జతల దుస్తులు ఇవ్వాలని కోరినా పట్టించుకోలేదని అన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ముబారక్, తిరుమలప్ప, పృథ్వీరాజ్, వంశీ, నాగరాజు, ఇంద్రాణి, శేఖర్, ఓబులేసు పాల్గొన్నారు.

మామిడిలో సస్యరక్షణతో నాణ్యమైన దిగుబడులు


సమావేశంలో మాట్లాడుతున్న సుకుమార్ రెడ్డి

కలికిరి : మామిడిలో సస్యరక్షణ చర్యలతో నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చని ఉద్యానశాఖ అధికారి సుకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక కేవీకే కార్యాలయంలో మామిడి సస్యరక్షణ చర్యలపై గురువారం ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామిడి పూత దశలో ఉన్నందున తేనెమంచు పురుగు, బూడిద తెగులు, కన్ను తెగులు ఆశించే అవకాశం ఉందన్నారు. నివారణకు మోనోక్రొటోఫాస్ 1.6 గ్రాములు, ఒక గ్రాము కార్బెండిజమ్, రెండు మిల్లీ లీటర్ల వేప నూనె, ఒక మిల్లీ లీటరు జిగురు మందు నీటిలో కలిపి చెట్టు కాండము, కొమ్మలు, ఆకులు పూర్తిగా తడిచేలా పిచికారీ చేయాలన్నారు. పూత, పిందె రాలకుండా ప్లానోఫిక్స్ 0.2 మిల్లీ లీటరు మందు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. పిందె దశలో నీటి వసతి ఉన్న రైతులు చెట్టుకు కిలో యూరియా, 750 గ్రా. పొటాష్ భూమిలో వేసి నీరందించాలన్నారు. కాయ దశలో పండు ఈగ నివారణకు ఎరలను సామూహికంగా రైతులు ఏర్పాటుచేసుకోవాలని తెలిపారు. ఈ క్యార్యక్రమంలో కేవీకే కో-ఆర్డినేటర్ డా.మంజుల, కేవీకే శాస్త్రవేత్తలు శ్రీనివాస్, పీరూ సాహెబ్, వాల్మీకిపురం ఉద్యానశాఖ అధికారి ఈశ్వర్‌ప్రసాద్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

హోలీ.. వెలుగులు నింపాలి


నిస్సార్‌అహ్మద్

మదనపల్లె సిటీ : హోలీ పండుగ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయ కర్త నిస్సార్ అహ్మద్ ఓ ప్రకటనలో తెలిపారు. పండుగ రాష్ట్ర ప్రజల కుటుంబాల్లో ఆనందాలు నింపాలని ఆకాంక్షించారు. సహజ రంగులతో పండుగ జరుపుకోవాలని కోరారు.

హనుమద్వాహనంపై వేంకటేశ్వరుడు


వాహనంపై కొలువుదీరిన వేంకటేశ్వరుడు

రామసముద్రం : రామసముద్రం మండలం చెంబకూరులో వెలసిన గట్టు వెంకటేశ్వర స్వామి బ్రహ్మ రథోత్సవాలలో భాగంగా గురువారం స్వామి హనుమంత వాహనంపై ఊరేగారు. ఉదయం స్వామికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకం, కుంకుమార్చన ఘనంగా నిర్వహించారు. చుట్టుప్రక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అర్చకులు రామచంద్ర బట్టర్ తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

లబ్ధిదారుల ఇళ్లకు అదనపు నిధులు

రామసముద్రం : మండలంలో వివిధ దశల్లో నిలిచిపోయిన గృహాల నిర్మాణం పూర్తి చేసేందుకు ప్రభుత్వం అదనపు సాయం ఇస్తోందని ఎంపీడీవో భానుప్రసాద్, హౌసింగ్ ఏఈ రాజేశ్వరి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ సెక్రటరీలు, సచివాలయ ఇంజినీర్లతో గృహ నిర్మాణాలపై వారు సమీక్షించారు. ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని పంచాయతీలలో సోమవారం నుంచి గ్రామ సభలు నిర్వహించి లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని కోరారు.

అసంపూర్తి నిర్మాణాలకు సాయం

నిమ్మనపల్లె : అసంపూర్తి నిర్మాణాలకు ప్రభుత్వం అదనపు సాయం చేస్తోందని ఎంపీడీవో పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. ఏవో రమేష్, హౌసింగ్ ఏఈ అమర్నాథ్‌తో కలిసి విలేకరులతో ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు గతంలో అందించిన రూ.1.80 లక్షలకు అదనంగా బీసీ, ఎస్సీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు నాలుగు దశల్లో ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని లబ్ధిదారులు నిర్మాణం పూర్తి చేయాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

తంబళ్లపల్లె : స్థానిక మోడల్ స్కూల్‌లో 2025-26 విద్యా సంవత్సరానికి ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని ప్రిన్సిపల్ హేమంత్ కుమార్ కోరారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపులలో ఆంగ్లంలో బోధన ఉంటుందన్నారు. పది విద్యార్థులు ఈ నెల 17వ తేదీ నుంచి మే 22వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలన్నారు. మరిన్ని వివరాలకు ప్రిన్సిపల్ సెల్ నంబర్ 9052153538ను సంప్రదించాలన్నారు.

విద్యార్థులకు ఉత్తమ బోధన

కేవీపల్లి : అంగన్వాడీలు, ఉపాధ్యాయులు విద్యార్థులకు ఉత్తమ బోధన అందిస్తారని ఎంఈఓ రెడ్డిబాషా తెలిపారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో గురువారం ప్రపంచ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఎంఈవో మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. మహిళల విద్యతో కుటుంబం, సమాజం బాగుపడుతుందన్నారు. అనంతరం ఉపాధ్యాయినులు, అంగన్‌వాడీ టీచర్లను దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పచ్చార్ల సుధాకర్, చంద్రశేఖర్, అమర్‌నాథ్‌రెడ్డి, అన్నపూర్ణ, భారతి, శంకరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మొల్లమాంబ జయంతి


మొల్లమాంబకు నివాళులర్పిస్తున్న శాలివాహన సంఘ నాయకులు

మదనపల్లె సిటీ : వాల్మీకి రామాయణాన్ని సంస్కృతం నుంచి తెలుగులోకి అనువదించిన తొలి తెలుగు మహిళా కవయిత్రి మొల్లమాంబ అని కుమ్మర శాలివాహన సంఘం అధ్యక్షుడు గోవిందరాజులు అన్నారు. కవయిత్రి మొల్లమాంబ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి గురువారం ఘనంగా నివాళులర్పించారు. గోవిందరాజులు మాట్లాడుతూ శాలివాహన సంఘం కోసం ప్రభుత్వం కేటాయించిన 1.18 సెంట్ల స్థలాన్ని కేటాయించాలన్నారు. కమ్యూనిటీ భవనం, మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్, సంక్షేమ హాస్టల్‌తో జాతి అభివృద్ధికి దోహదపడే కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. పట్టణంలోని ఓ కూడలిలో మొల్లమాంబ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రంగప్ప, నాయకులు గంగులప్ప, శ్రీనివాసులు, శంకర, కృష్ణమూర్తి, వెంకటరమణానారాయణ తదితరులు పాల్గొన్నారు.

పెయ్య దూడల ప్రదర్శన


లేగదూడల ప్రదర్శనలో పశు వైద్య సిబ్బంది

మదనపల్లె సిటీ : మదనపల్లి మండలం కొత్తపల్లె గ్రామంలో గురువారం పెయ్య దూడల ప్రదర్శన నిర్వహించారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో 85 మంది పాడి రైతులు తమ పెయ్య దూడలను ప్రదర్శనకు తీసుకువచ్చారు. పశుగణాభివృద్ధి తిరుపతి ఉప సంచాలకులు డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం లేగ దూడల పెంపకంలో యాజమాన్య పద్ధతులను తెలియజేశారు. ఉత్తమ ప్రదర్శన కనబరచిన మొదటి మూడు దూడల యజమానులకు బహుమతులు అందజేశారు. రోగ నివారణ మందులు, లవణ మిశ్రమాలను మదనపల్లె పశుసంవర్ధక శాఖ ఏడీ రోహిణి అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ లారెన్స్, సుబ్బారావు, ప్రసాదరెడ్డి, లైవ్ స్టాక్ ఆఫీసర్ నరసింహారెడ్డి, యుగంధర్, భాను ప్రకాష్, ఏహెచ్‌ఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

హెల్పింగ్ మైండ్స్ సభ్యుల మానవత్వం


వృద్ధుడి శవాన్ని ఖబర్‌స్థాన్‌కు తీసుకెళ్తున్న సభ్యులు

మదనపల్లె సిటీ : తనను కాదనుకున్నారేమో.. కన్నవాళ్లు వదిలేశారు. ఒంటరిగా జీవనం సాగించి మృతి చెందిన ఆ వృద్ధుడికి తమ వంతుగా అంత్యక్రియలు నిర్వహించి భళా అనిపించారు హెల్పింగ్ మైండ్స్ సభ్యులు. స్థానిక సీటీఎం రోడ్డులోని చైతన్య అనాథ ఆశ్రమంలో గురువారం ఓ వృద్ధుడు మృతిచెందాడు. కుటుంబీకులు ఎవరూ ముందుకు రాకపోవడంతో హెల్పింగ్ మైండ్స్ సభ్యులు ప్రత్యేక అంబులెన్స్‌లో మృతదేహాన్ని ఖబర్‌స్థాన్‌కు తీసుకెళ్లారు. ముస్లిం సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకులు అబూబకర్‌సిద్దిక్, సభ్యులు హనీఫ్, కిరణ్, చైతు, హర్ష, ఆశ్రమ నిర్వాహకులు బాబు, కవిత తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా.. శ్రీనివాసుడి కల్యాణం


అక్షరాభ్యాసం చేస్తున్న చిన్నారులు

మదనపల్లె సిటీ : స్థానిక దేవళం వీధిలోని ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయంలో గురువారం శ్రీనివాసుడి కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ ప్రాంగణంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను కొలువుదీర్చి ప్రత్యేకంగా అలంకరించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణ మధ్య వివాహ క్రతువు నిర్వహించారు. అనంతరం సరస్వతి పూజ నిర్వహించి ప్రధాన అర్చకులు గోవర్ధన్ భట్టార్ 50 మంది చిన్నారులను అక్షరాభ్యాసం చేయించారు. అక్షరాభ్యాసం కిట్టును ఆలయ మాజీ చైర్మన్ బింగి పొందు అందజేశారు. ఉదయం విశ్వక్సేన ఆరాధన పుణ్యాహవచనం, మహా సుదర్శన కలశప్రతిష్ఠ, మహా సుదర్శన హోమం, హయగ్రీవ హోమం, మహాపూర్ణాహుతి, మూలవర్లకు కలశ అభిషేకం నిర్వహించారు. సాయంత్రం పౌర్ణమి పురస్కరించుకుని స్వామిని గరుడ వాహనంపై ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ బింగి పొందు, మాజీ సభ్యులు ప్రసాద్‌రెడ్డి, గంగారపు భాస్కర్‌రెడ్డి, నాగేంద్ర, సాయిచిత్ర భాస్కర్‌నాయుడు, ఎంఈఓ తిరుమల, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కిడ్నీ ఆరోగ్యం కాపాడుకోవాలి


కేక్ కట్ చేస్తున్న సూపరింటెండెంట్ కోటేశ్వరి

మదనపల్లె : ప్రతి ఒక్కరూ కిడ్నీల ఆరోగ్యం కాపాడుకోవాలని స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కోటేశ్వరి అన్నారు. ఆస్పత్రిలోని డయాలసిస్ సెంటర్‌లో గురువారం ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు, వైద్య సిబ్బందికి కిడ్నీ వ్యాధులపై అవగాహన కల్పించారు. కిడ్నీలను సురక్షితంగా ఉంచాల్సిన ఆవశ్యకత తెలియజేశారు. కిడ్నీలు నీటిశుద్ధి యంత్రంలా పనిచేస్తూ శరీరంలోని వ్యర్థాలను బయటకు పంపిస్తాయన్నారు. ఆకుకూరలు, కూరగాయలు ఎక్కువగా తీసుకుంటూ తగినంత నీరు ఎప్పటికప్పుడు తాగి కిడ్నీ ఆరోగ్యాన్ని పెంపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఓ షకూర్, డాక్టర్ భారతి, నెఫ్రాలజిస్టులు శాశ్వతి, తేజస్విని, మేనేజర్ బాలు పాల్గొన్నారు.


వ్యాధి నిర్ధారణే కీలకం

మదనపల్లె : చికిత్సలో వ్యాధి నిర్ధారణే కీలకమని జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కోటేశ్వరి అన్నారు. జిల్లా ఆసుపత్రిలో ప్రపంచ ల్యాబ్‌టెక్నీషియన్ దినోత్సవం నిర్వహించారు. ల్యాబ్ టెక్నీషియన్లతో కలిసి కేక్ కట్ చేశారు. ఆమె మాట్లాడుతూ ఆధునిక కాలంలో ల్యాబ్‌టెక్నీషియన్లు సాంకేతికతను అందిపుచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఓ షకూర్, ల్యాబ్ ఇన్‌చార్జి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఒంటి పూట బడులు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 15వ తేదీ నుంచి ఒంటి పూట బడులు జరుగుతాయని ఎంఈఓ నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేడిమి పెరగడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నెల 15వ తేదీ నుంచి ఏప్రిల్ 23వ తేదీ వరకు ఒంటిపూట తరగతులు నిర్వహిస్తామని వెల్లడించారు.

గ్రామ దేవతల విగ్రహాల ప్రతిష్ట


నూతన ఆలయం

తంబళ్లపల్లె : మండలంలోని పంచాలమర్రి సమీపంలో నిర్మించిన ఆలయంలో వాయిలచెట్ల గంగమ్మ, దండుమారెమ్మల ప్రాణ ప్రతిష్ట శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు జరుగుతుందని గ్రామ ప్రజలు తెలిపారు. శుక్రవారం గోపూజ, గణపతి పూజ, అఖండ దీపారాధన, యాగశాల, అంకుర్పారణ, శనివారం దేవతా పూజ, అగ్నిప్రతిష్ట, గణపతి పూజ, జలాధివాసం జరుగుతాయన్నారు. ఆదివారం విగ్రహాల ప్రాణ ప్రతిష్ట, పూర్ణాహుతి, కుంభాభిషేకం జరుగుతాయన్నారు.